# అమ్మంటే అంతేమరి!

"నువ్వు నాకో సహాయం చేయాలి తమ్ముడూ!" ఓ రోజున రేడియో నాటకం 'రికార్డింగ్'కి వచ్చినపుడు అడిగింది సత్యవతి.

బహుశా తనకేదైనా ఇబ్బంది వచ్చి 'రికార్డింగ్'ని 'పోస్ట్‌పోన్' చేయమని అడుగుతుందేమో అనుకున్నాను.

ఇంతలో సత్యవతి మళ్లీ చెప్పింది -

"నేను ఏదైనా ఆశ్రమానికి వెళ్లిపోవాలనుకుంటున్నాను!" - అని

నేను ఆమె వైపు ఆశ్చర్యంగా చూశాను.

"అవును తమ్ముడూ! నా కొడుకులే నన్ను అసహ్యించుకుంటున్నారు. నా కోడళ్ళే నాపైన చేతులెత్తుతున్నారు!" - వచ్చే కన్నీటిని నాకు కనిపించనీయకుండా దాచుకునే ప్రయత్నం చేస్తూ చెప్పింది.

సత్యవతి నాకు పాతికేళ్ళుగా తెలుసు!

ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే, ఇరవై ఏడేళ్ళ క్రితం, నేను రేడియో నాటక విభాగంలో 'ఇన్‌ఛార్జి'గా చేరి నెలకు ఒకటో రెండో నాటకాలు నిర్వహిస్తున్న రోజుల్లో మొదటిసారి సత్యవతిని చూశాను. అపుడు 'రాణీరుద్రమ' పాత్ర పోషించింది. ఆమె వాచికాభినయానికీ, కంఠస్వరానికీ నేను ఆకర్షితుణ్ణయ్యాను. ఇపుడు సత్యవతికి అరవై ఏళ్ళు పైబడే వుంటాయి! అయినా ఆమె నటనా కౌశలం, ప్రౌఢత్వంతో రాటు తేలిందే తప్ప - వార్ధక్యభారంతో వాడిపోలేదు... అందుకే అమ్మపాత్రలకీ, అమ్మమ్మపాత్రలకీ ఆమెను అడపాదడపా పిలుస్తూనే వున్నాం!

రేడియో నాటకంలో పాల్గొన్నపుడల్లా ఓ వెయ్యిరూపాయల పారితోషికం ఆమెకు లభిస్తుంది... అదలావుండగా, ఈ మధ్యకాలంలో టీవీ సీరియల్స్‌లోనూ, సినిమాల్లోనూ కూడా చిన్న చిన్న వేషాలు వేస్తోంది. దానా దీనా నెలకో అయిదువేలు సంపాదించుకుంటోందని వినికిడి!

సత్యవతి భర్త చనిపోయి చాలాకాలమే అయింది. ఆ బాపతు పెన్షన్ కొద్దోగొప్పో ఆమెకు అందుతూ వుంటుంది. అమీర్‌పేటలో రెండు వాటాల ఇల్లుంది... వాటిలో, ఆమె ఇద్దరు కొడుకులూ వుంటున్నారు. వాళ్ళిద్దరూ ఆమెను చెరో ఆర్నెల్లూ దగ్గరుంచుకొని భోజనం పెట్టి - నెలనెలా వందరూపాయలు 'చేతిఖర్చు'లకిస్తారని ఓసారెప్పుడో ఆమె నాకు చెప్పినట్టు గుర్తుంది.

ఇన్ని ఆస్తులూ, అనుబంధాలూ వుండగా అన్నింటినీ వదులుకొని ఆశ్రమవాసాన్ని ఆమె ఎందుకు కోరుకుంటోందో అర్థంకాలేదు.

"అసలేం జరిగింది సత్యవతిగారూ?" అని ప్రశ్నించాను.

"చూడు తమ్ముడూ!.... ఈ చేతి మీదున్న వాత చూడు!" - అంతవరకూ పైట చెంగు కింద దాచుకున్న ముంజేతిని బైటకు తీసి చూపించింది...

ఉలిక్కిపడ్డాను.

తెల్లటి చేతిమీద - రక్తం గడ్డ కట్టినట్టుగా వున్న ఎర్రనివాత!

"అసలివాళ నాటకం రికార్డింగ్‌కి వచ్చే దాన్నికాను. కానీ నాకోడళ్ళిద్దరూ ఆటో పిలిచి బలవంతంగా నన్ను అందులోకి తోసి ఇక్కడకు పంపించారు!" కళ్ళు తుడుచుకుంటూ చెప్పిందామె.

"ఇంతకీ చేతి మీద ఆ వాతేమిటి?" - అడిగాను.

"మా కోడళ్ళిచ్చిన బహుమతి!"

ఒళ్ళు జలదరించింది నాకు!

కోడళ్ళను ఆరడి పెట్టే అత్తలకథలు విన్నానుకానీ - కోడళ్ళే అత్తకు వాతలు పెట్టిన సంఘటనలు నేనెప్పుడూ వినలేదు.

"ఈ గాజులు రెండూ తీసి వాళ్ళకిచ్చేయాలట తమ్ముడూ!... ఆర్నెల్లనించీ నాప్రాణాలు తింటున్నారు. నేను కాటికి కాళ్ళుచాపుకున్న ముసలిదాన్నట. షూటింగులకనీ, రికార్డింగులకనీ, 'పగలూ రాత్రీ తిరుగుతూంటానట - ఎపుడో ఏ నడిరోడ్డుమీదనో దిక్కులేని చావు చస్తే - చేతినున్న ఈ బంగారు గాజుల్ని ఎవరైనా కాజేయచ్చునట!' ... అదీవరస!... నేను చచ్చినా వీటి నివ్వనంటూ మొండికెత్తాను. వాళ్ళు అంతకంటే మొండిగా ప్రవర్తించి, ఇదిగో ఇలా వాతపెట్టి మరీ తీసుకున్నారు!"

"మరి మీ అబ్బాయిలకు చెప్పలేదా?" - అడిగాను.

"చెప్పేం ప్రయోజనం?... ఇద్దరూ చవటలే అయ్యారు. వాళ్ళకి పెళ్ళాలే ముద్దు... 'నేనెపుడుపోతానా' అని దేవుళ్ళకు మొక్కుకుంటున్నారు.... పైగా ఇంకోతమాషా!... నేను టీవీలో నటిస్తే వాళ్ళకు నామోషీగా వుంటుందట! నన్నసలు బైటకే వెళ్ళద్దంటారు.. కానీ నీకు తెలుసుగా తమ్ముడూ!... చిన్నప్పటి నుంచీ నాటకాలంటే నాకు ప్రాణం. రంగస్థలం మీద ఊపిరి పోసుకున్నదాన్ని... రేడియో ఒడిలో పెరిగి పేరు ప్రతిష్టలు సంపాదించుకున్న దాన్ని... ఓపికున్నంత కాలం ఇలా నటిస్తూనే వుంటాను!" ఆవేశంగా చెప్పింది సత్యవతి.

"ఈ వయసులో, పిల్లలదగ్గర వుంటున్నందుకు - వాళ్ళ మాటకూడా వినాలికదా సత్యవతిగారూ?" - ఏం చెప్పాలో తెలియక, యదాలాపంగా అన్నాను.

"నేనూ అలాగే అనుకుంటూంటాను తమ్ముడూ! కానీ రేడియోనించి 'కాంట్రాక్టు' వచ్చిందంటేచాలు, మా కోడళ్ళిద్దరూ ప్రతిరోజూ గుర్తు చేసి మరీ ఇలా రికార్డింగ్‌కి పంపుతారు. వాళ్ళకి నేనిచ్చే డబ్బూ, నేనుచేసే చాకిరీ కావాలి! ఇవాళ మీరిచ్చే చెక్కుకోసం వాళ్ళిద్దరూ గుమ్మందగ్గరే కాపలా కాస్తూంటారు!... వాళ్ళే దాన్ని బ్యాంకులో వేస్తారు. ముందుగానే నా చేత 'విత్‌డ్రాయల్ ఫారం' మీద సంతకం చేయించుకుని - రేపెప్పుడో నాకు తెలియకుండానే డబ్బు 'డ్రా' చేసి పంచుకుంటారు!!" - ఆమె కళ్ళల్లో మళ్ళీ నీళ్ళూరటం గమనించాను.

ఆమె 'మూడ్' మార్చాలన్న ఉద్దేశ్యంతో కుర్చీలోంచి లేచాను.

"రికార్డింగ్‌కి ఇంకా టైం వుంది... తక్కిన ఆర్టిస్టులు రావాలిగా... రండి! క్యాంటిన్‌లో కాఫీ తాగుదాం!" - అన్నాను.

కాఫీ తాగుతున్నంతసేపూ సత్యవతి ఏమీ మాట్లాడలేదు. తమ కుటుంబ విషయాలు మరింత వివరంగా నా ముందు వెళ్ళబోసుకోవటం భావ్యంకాదని ఊరుకుందేమో అనుకున్నాను.

ఇక లేద్దామనుకుంటుంటే అపుడు మళ్ళీ అందామె -

"నీకు తెలీదు తమ్ముడూ! నేను... నేను చీర కొనుక్కొని మూడేళ్ళయింది. ఎప్పుడైనా 'డబ్బివ్వండమ్మా! ఓ చీరగుడ్డ కొనుక్కుంటా!' - అని ప్రాధేయపడి అడిగితే వాళ్ళు కట్టి విడిచిన పాతచీరలేవో నా మొహాన కొడతారు!"

అంతా విన్న తర్వాత ఆమె పరిస్థితికి జాలిపడటం తప్ప నేను మాత్రం ఏం చెప్పగలను?.

"ఇప్పుడింతకీ నన్నేం చేయమంటారు?" - అడిగాను రెండుక్షణాల తర్వాత.

"ఇవాళ నాటకం రికార్డింగ్ అయిపోగానే - క్రాస్ చేయకుండా నాకు చెక్కు ఇప్పించాలి తమ్ముడూ!"

అర్థంకానట్టు చూశాను.

"మరేంలేదు బాబూ!... రేపుసాయంత్రం - నాకు తెలిసినవాళ్లు, హరిద్వారం, ఋషీకేశం వెడుతున్నారు... అక్కడ ఏవో ఆశ్రమాలున్నాయట... నేను కూడా వాళ్ళతో వెళ్లి - పరిస్థితులు బాగుంటే అక్కడే వుండిపోవాలను కుంటున్నాను... అక్కడకు

వెళ్లాలంటే డబ్బు కావలిగా! చెక్కు 'క్రాస్' చేయకుండా ఇస్తే - రేపొద్దున్నే బ్యాంకుకి వెళ్ళి 'డ్రా' చేసుకుంటాను!" చెప్పింది మళ్లీ.

"మరి మీరు ఇంటికి వెళ్ళింతర్వాత - చెక్కు ఇవ్వమని మీ కోడళ్లు అడగరా?"

"అదే చెప్పబోతున్నాను... చెక్కు ఇవ్వలేదనీ, త్వరలో దాన్ని పోస్టులో పంపుతామనీ నువ్వోకాగితం ముక్కమీద రాసివ్వాలి తమ్ముడూ!" ఆశగా చూసిందామె.

"ఒక వేళ రేపు వాళ్లు మిమ్మల్ని వెళ్ళద్దంటే?" నా అనుమానాన్ని వ్యక్తం చేశాను.

"చెప్తే, ఎలాగా వెళ్ళద్దనే అంటారు!... అందుకే అప్పటికేదో అబద్దం చెప్పి ఆ ఇంటి గడప దాటుతాను... ఆ తర్వాత నాకు భగవంతుడే వున్నాడు!" చెప్పింది సత్యవతి.

ఆ సాయంత్రం 'రికార్డింగ్' పూర్తికాగానే మా అక్కౌంట్స్ ఆఫీసర్‌తో చెప్పి ఆమె కోరినట్టుగా - 'క్రాస్' చేయకుండా చెక్కురాయించి ఇప్పించాను.

ఆ తర్వాత ఆమెను నేను పూర్తిగా మర్చిపోయాను....

★ ★ ★

రెండు రోజులుగా విడవకుండా కురిసిన వర్షం ఆ రోజున కొంచెం తెరిపిచ్చింది...

ఆదివారం కావటంవల్ల నేను ఇంట్లోంచి బయటకు వెళ్ళలేదు.

సాయంత్రం నాలుగ్గంటల వేళ...!

హాల్లో కూర్చుని మా ఆవిడ చేసిన టిఫిన్ తింటూ టీవీలో వస్తున్న 'ఫ్రెంచ్ ఓపెన్' చూస్తున్నాను.

అంతలోనే - వీధిలో ఆటో ఆగిన చప్పుడైతే అటుచూశాను.

'ఆటోవాలా'కి డబ్బులిచ్చి పంపి లోపలకు వస్తోంది ఓ వృద్ధురాలు!

ఆమెను సత్యవతిగా పోల్చుకునేందుకు కొన్ని క్షణాలు పట్టింది. లోపలకు ఆహ్వానించి కుర్చీ చూపించాను.

"బావున్నావా తమ్ముడూ?" అడిగింది సత్యవతి.

"బావున్నాను! మీరేమిటీ ఇంతగా చిక్కిపోయారు? అపుడెపుడో ఏడాదిక్రితం 'రికార్డింగ్'కి వచ్చినపుడు ఏదో ఆశ్రమానికి వెడుతున్నట్టు చెప్పారు. వెళ్ళలేదా?... అసలిపుడు ఎక్కడుంటున్నారు?" ఆతృతకొద్దీ గబగబా అడిగాను....

మా ఆవిడ తెచ్చిన మంచినీళ్లు తాగి నెమ్మదిగా చెప్పింది సత్యవతి -

"ఆశ్రమానికి వెళ్ళటం - తిరిగి రావటంకూడా అయింది తమ్ముడూ! అక్కడ

ప్రశాంతంగానే వున్నా - ఎందుకో ఒంటరిగా వుండలేకపోయాను. ఆశ్రమంలో మొత్తం డబ్బయ్‌మందికి పైనే వుండేవారు. వాళ్ళంతా ఏదిక్కూ లేనివాళ్లే. కొందరయితే, భార్యాభర్తలు కూడా వున్నారు. నా గురించి తెలుసుకున్న చాలామంది 'చేతికందిన కొడుకుల్నీ చేరువయ్యే మనవల్నీ వదలి ఆశ్రమానికి వచ్చావా' అంటూ గుచ్చి గుచ్చి అడిగేవారు. నా మనసు చివుక్కుమనేది! కొన్నాళ్ళకి మా ఆశ్రమంలో వుంటున్న ఓ వృద్ధురాలు చనిపోయింది. అక్కడి అధికారులు ఆమెను దహనం చేశారు.. ఎందుకో ఆ సన్నివేశం నన్ను బాగా కదిలించింది... నేనూ ఒకనాడు అలాగే చనిపోతానా? అపుడు నా పిల్లలకు తెలియపరుస్తారో లేదో... తెలియపరచినా, వాళ్లు వస్తారో రారో?". చెప్పటం ఆపి నావైపు చూసింది సత్యవతి.

ఆమె ఆంతర్యాన్ని అర్థంచేసుకోవటానికి ప్రయత్నించాను.

అంటే.. 'ఒకవేళ తను చనిపోతే, కన్నకొడుకు చేత తలకొరివి పెట్టించుకోవాలన్న కాంక్షవల్లనే - ఆశ్రమం నించి తిరిగి వచ్చేసింది కాబోలు' - అనుకున్నాను.

ఇంతలో ఆమె మళ్లీ చెప్పసాగింది -

"కోడళ్లు అసహ్యించుకున్నా, సాధించినా బ్రతికుండే, నాలుగురోజులూ - ఆ ఆశ్రమంలో చేసే చాకిరీ ఏదో నా వాళ్ళకే చేస్తూ - వాళ్ళ కళ్ళముందే వుంటే తృప్తిగా వుంటుందని పించింది. పిల్లల దగ్గరే వుండి - వాళ్లు తిండి పెట్టకపోయినా కనీసం వాళ్ళ చేతుల - మీదుగా నేను మట్టిలో కలిసిపోవాలన్న స్వార్థంతో తిరిగి వచ్చేశాను తమ్ముడూ!.. అప్పుడే నాలుగు నెలలయింది!"

అయితే ఇప్పుడు మళ్లీ రేడియో నాటకాల్లో పాల్గొనే అవకాశం ఇవ్వమని అడగటానికి వచ్చిందన్నమాట! ఆ సంగతే అడిగాను -

"మళ్లీ నాటకానికి కాంట్రాక్ట్ పంపితే..."

నాప్రశ్న పూర్తి కాకుండానే - చేత్తో వారిస్తూ చెప్పిందామె -

"అబ్బే... నేను రేడియో కాంట్రాక్ట్ కోసం రాలేదు తమ్ముడూ !

"మరి?"

"రేపు నేను ఆపరేషన్‌కి వెడుతున్నాను... ఆ విషయం చెప్పాలనీ..." సందేహిస్తున్నట్టుగా మధ్యలోనే ఆగిపోయిందామె.

"ఆపరేషనా? మీకా?॥

"అవును!... కిడ్నీ తీసేస్తారు!"

"అంటే... మీ కిడ్నీ చెడిపోయిందా?"

వెంటనే జవాబు చెప్పలేదు సత్యవతి. తలదించుకుని నేలచూపులు చూస్తోంది. అంతలో మా ఆవిడ కాఫీ తెచ్చింది... దాన్ని తాగింతర్వాత, ముఖాన పెట్టిన చెమట పైట చెంగుతో తుడుచుకుని చెప్పింది -

"మా పెద్దాడు పనిచేసే కంపెనీ మేనేజరుగారి తల్లికి 'కిడ్నీ' జబ్బు వచ్చిందట తమ్ముడూ! రెండు కిడ్నీలూ పూర్తిగా చెడిపోయాయి... ప్రాణాపాయస్థితిలో - హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు. ఎవరైనా 'కిడ్నీ' దానం చేస్తే బ్రతుకుతుందట.... అదృష్టవశాత్తూ ఆవిడగారి బ్లడ్‌గ్రూపూ - నా బ్లడ్‌గ్రూపూ ఒకటేకావటంతో - నా కిడ్నీ ఇవ్వమని మా అబ్బాయి బ్రతిమాలాడు!... వాళ్ళ మేనేజరు వాడికి ప్రమోషన్ ఇస్తానన్నాట్ట.... అంతే కాకుండా కిడ్నీకి ఇంకో లక్షరూపాయలు కూడా ఇస్తానంటున్నాడట!.. పెద్దాడికీ, చిన్నాడికీ చెరో ఆడపిల్లా వున్నారన్న సంగతి నీకు తెలుసుగా?... రేపెప్పుడో వాళ్ళకు పెళ్ళిళ్ళు చేయాలట! నేను కిడ్నీదానం చేయగా వచ్చే లక్షరూపాయలూ - వాళ్లిద్దరి పేరా 'ఫిక్సుడు'లో వేస్తారట... నా మొగుడు మిగిల్చిపోయిన ఆస్తిని కొడుకులు పంచుకున్నారు.... రేడియోలోనూ టీవీలోనూ నటించి సంపాదించిన డబ్బును నా కోడళ్లు పంచుకున్నారు.. ఇక నామనవరాళ్ళకి నేనేమీ పెట్టలేకపోయానే అన్న చింత లేకుండా ఇప్పుడు ఈ ఏర్పాటు కూడా జరిగిపోతోంది..." నిర్వేదంగా నవ్వుతూ చెప్పింది సత్యవతి.

'ఇంత అన్యాయమా?... కన్నతల్లి అవయవాల్ని కూడా తమ స్వార్థప్రయోజనాల కోసం నడిబజాల్లో అమ్ముకుంటారా' అని అడగాలనుకున్నాను... కానీ గుండెలోమాట గొంతు వరకూ వచ్చి ఆగిపోయింది. బాధగా ఆమె వైపు చూశాను.

"ఎంత విచిత్రంగా వుందో చూశావా తమ్ముడూ?.. ఆ కొడుకు - తల్లి ప్రాణాల్ని కాపాడుకునేందుకు లక్షరూపాయలు ఖర్చుపెడుతున్నాడు!... ఈ కొడుకు తల్లిప్రాణాల్ని పణంగా పెట్టి లక్షరూపాయలు ఆర్జించాలని ఆశపడుతున్నాడు... ఆవిధంగా రెండు రకాల భావాలు కలిగిన మనుషులకి నేను సమిధ నవుతున్నాను... అసలు ఆశ్రమంనించి తిరిగి వచ్చేయాలన్న ఆలోచన - నాకు భగవంతుడు ఇందుకే కలిగించాడేమో?"

"ఇంతకీ కిడ్నీ ఇవ్వటానికి మీరెలా ఒప్పుకున్నారు.... అసలే నీరసంగా వున్నారు... పైగా మీ వయసూ తక్కువేం కాదు!" - సత్యవతి పట్ల మొదట్నించీ నాలో ఏర్పడిన సానుభూతి - నాచేత ఆమాటలనిపించింది.

"ఒప్పుకోక ఏం చేయమంటావ్ తమ్ముడూ?... అలా అయినా వాళ్ళచేత 'మాఅమ్మ చాలా మంచిద'నిపించుకోవచ్చునన్న స్వార్థమే నాచేత ఒప్పించింది.... పైగా నేను కిడ్నీ అమ్ముతున్నది నాపిల్లల కోసమేగా?.... నిన్ననే నన్ను ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు

చేయించారు... నా కిడ్నీ పనిచేస్తుందట... వాళ్ళ సంతోషానికి అవధులు లేవనుకో... నిన్నటినించీ నన్ను పువ్వుల్లో పెట్టి మరీ చూస్తున్నారు తమ్ముడూ.... ఈ జన్మకీ రెండు రోజుల సంతృప్తి చాలు... రేపొద్దున్నే ఆపరేషన్ చేస్తారట... అందుకే ఈ ఆదివారం పూటా పని గట్టుకుని మీ ఇంటికొచ్చి నీకు ఇబ్బంది కలిగించాను..."

ఇంతకీ నేనేం చేయాలో బోధపడలేదు.

ఇంతలో తనే మళ్ళీ చెప్పింది -

"మరేం లేదూ తమ్ముడూ! ఈ ఆపరేషన్ తర్వాత నేను బ్రతికి బట్టకడతానన్న నమ్మకంలేదు... బ్రతికినా వారాలూ, నెలలూ...! అంతే! ఆ తర్వాత నేను చనిపోతే - "గత మూడు దశాబ్దాల పాటు రంగస్థలనటిగా ఎన్నో బహుమతుల్ని పొంది. రేడియోనాటిక లెన్నింటిలోనో నటించి శ్రోతల అభిమానాన్ని అందుకున్న ఫలానా సత్యవతి ఇకలేదు' - అని రేడియోలో చెప్పిస్తావా తమ్ముడూ?" - జీవంలేని కళ్ళతో ఆశగా నావైపు చూస్తూ అడిగింది సత్యవతి.....

ఆ ప్రశ్న వినగానే నా కళ్ళల్లోకి ఒక్కసారిగా కన్నీళ్లు ఉబికి వచ్చాయి !!!

*(ఆదివారం... ఈనాడు 22-2-1998)*

★ ★ ★